సాక్షి మంచిర్యాల

శనివారం, 18, నవంబర్, 2023



అమలుకు నోచుకోని సర్క్యులర్

ఎన్నికల నేపథ్యంలో బొగ్గు ఉత్పత్తికి ఆటంకం కలుగకుండా గనుల ఆవరణలో సమావేశాలు, ప్రచారాన్ని నిషేధిస్తూ యాజమాన్యం ఇచ్చిన సర్క్యులర్ అమలుకు నోచుకోవడం లేదు.10లో



సగానికిపైగా విద్యావంతులే..

అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల్లో సగానికి పైగా ఉన్నత విద్యావంతులే ఉన్నారు. ఏడో తరగతి నుంచి డిగ్రీ, ఎంబీబీఎస్, ఇంజినీరింగ్, ఐపీఎస్ చదివిన వారు ఉన్నారు.10లో

గరిష్టం/కనిష్టం 32.0 /20.0

వాతావరణం

ఉదయం ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. రాత్రివేళ పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

లెక్కల అంకెలు దిద్దుబాటుపై విచారణ

బెల్లంపల్లి: అసెంబ్లీ ఎన్నికల ప్రచార అనుమతి కోసం రాజకీయ పార్టీల అభ్యర్థులు చెల్లించిన రుసుం లెక్కల అంకెలను బలవంతంగా దిద్దించిన బెల్లంపల్లి మున్సిపల్ కమిషనర్‌పై అంతర్గత విచారణ సాగుతోంది. అవకతవకలకు పాల్పడిన కమిషనర్ పై చర్యలు తీసుకోవాలని కొందరు రాష్ట్ర ఎన్నికల సంఘం, జిల్లా ఎన్నికల అధికారి, బెల్లంపల్లి ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు వేర్వేరుగా ఫిర్యాదు చేశారు. స్పందించిన ఎన్నికల అధికారులు తక్షణమే కమిషనర్‌పై విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని ఆదేశించినట్లు సమాచారం. ఫిర్యాదు చేసిన వ్యక్తులతో శుక్రవారం సీవిజిల్ అధికారులు వ్యక్తిగతంగా మాట్లాడి వివరాలు సేకరించినట్లు తెలుస్తోంది. ఒకట్రెండు రోజుల్లో సదరు అధికారిపై వేటు పడే అవకాశాలు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకుని వేటు వేయాలనే యోచనలో ఉన్నతాధికారులు ఉన్నట్లు తెలుస్తోంది. కాగా, రోజువారీగా 'సాక్షి'లో ప్రచార లెక్కల కథనా లు రావడంతో సదరు అధికారి మున్సి పల్ సిబ్బందిపై చిర్రుబుర్రు లాడుతున్నట్లు తెలుస్తోంది. జరి గిన తప్పిదానికి తనదే బాధ్యతని ఒప్పుకోవాలని ఓ సిబ్బందిపై ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం.

ముగిసిన జోనల్‌స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు



ఎంపికైన విద్యార్థులతో ఎస్‌జీఎఫ్ సెక్రెటరీలు

మంచిర్యాలఅర్బన్: స్థానిక రంగపేట్ బ్యాడ్మింటన్ ఆకాడమీలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జోనల్‌స్థాయి బ్యాడ్మింటన్ అండర్-14,17 బాలబాలికల, అండర్-19 బాల, బాలికల ఎంపిక పోటీలు శుక్రవారంతో ముగిశాయి. ఈ పోటీలకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఎంపికై నవారు రాష్ట్రస్థాయి పోటీలో పాల్గొనున్నారు. అండర్-19 బాల,బాలికలు వీవీ స్పోర్ట్స్ అల్వాల్ రంగారెడ్డి జిల్లాలో ఈనెల 24 నుంచి 26 వరకు జరిగే పోటీలకు హాజరవుతారని ఎస్‌జీఎఫ్ కార్యదర్శి పరిమిళ తెలిపారు. జూనియర్ కళాశాల ఎస్‌జీఎఫ్ కార్యదర్శి బాబురావు, పీడీ రేణిరాజయ్య, పీఈటీలు గోపాల్, శ్రీనివాస్‌రెడ్డి, యాకుబ్, బెల్లం శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

మంచిర్యాలఅర్బన్: స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన జోనల్ స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ అండర్-14, 17 బాల, బాలికల పోటీల్లో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థుల వివరాలను ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి పరిమిళ ప్రకటించారు. అండర్-14 బాలికల విభాగంలో అనన్య, అశిర్య, ఆరాధ్య(మంచిర్యాల), ఐశర్య(ఆదిలాబాద్), సహస్రరావు(మంచిర్యాల), అండర్-14 బాలుర విభాగంలో ఈశ్వరప్రసాద్, తనీష్, అమూల్‌కృష్ణ(మంచిర్యాల), సీహెచ్.వెంకటేశ్, సాయివిగ్నేష్(ఆదిలాబాద్), అండర్-17 బాలుర విభాగంలో ఆకాశ్, రేవంత్(ఆదిలాబాద్), వేణుచరణ్, రాధేశ్యాం(మంచిర్యాల), జస్వంత్(ఆసిఫాబాద్), అండర్-17 బాలికల విభాగంలో సాయిస్పందన(ఆదిలాబాద్), అమూల్య, వర్షిణీ(ఆసిఫాబాద్), హర్షిణీ, సాయి సీతుశ్రీ(మంచిర్యాల) ఎంపికైనట్లు తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి పాల్గొంటారని తెలిపారు.

4న చలో ఢిల్లీ



కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

పాతమంచిర్యాల: దళితుల రాజ్యాంగ హక్కుల కోసం డిసెంబర్ 4న నిర్వహించే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు దేవి పోచన్న అన్నారు. శుక్రవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో చలో ఢిల్లీ కార్యక్రమం కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటికీ దళితులు అంటరానితనం, కులవివక్ష, దాడులు, హత్యలకు గురవుతున్నారని అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దళితులను భూమి, విద్య, సంపద, వైద్యానికి దూరం చేస్తోందని విమర్శించారు. దేశవ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ ఏర్పాటు చేయాలనే తదితర డిమాండ్ల సాధన కోసం చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు మొగిలి లక్ష్మణ్, పానగంటి యోసేపు, యాకోబు, గాజుల రవికుమార్ పాల్గొన్నారు.

ఐటీ హబ్ కావాల్నా.. పేకాట క్లబ్ కావాల్నా

- మంచి మంచిర్యాలను కాపాడుకోండి
- ఢిల్లీ నేతలకు అధికారం కట్టబెట్టవద్దు
- రోడ్‌షోలో మంత్రి కేటీఆర్



రోడ్‌షోకు హాజరైన కార్యకర్తలు, ప్రజలు



మంచిర్యాల రోడ్‌షోలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్, పక్కన దివాకర్‌రావు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల ప్రజలకు ఐటీ హబ్ కావాల్నా.. పేకాట క్లబ్ కావాల్నా మీరే ఆలోచించుకోవాలని, ఐటీ హబ్ కావాలంటే మరోసారి బీఆర్‌ఎస్ అభ్యర్థి నడిపెల్లి దివాకర్‌రావు కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని మంత్రి కేటీఆర్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం మంచిర్యాల పట్టణంలోని ఫ్లైఓవర్ బ్రిడ్జి నుంచి శ్రీనివాస థియేటర్, ముఖరంచౌరస్తా, అర్చన టెక్స్ చౌరస్తా, మార్కెట్ రోడ్డు, బస్టాండ్ మీదుగా బెల్లంపల్లి చౌరస్తా వరకు కేటీఆర్ రోడ్‌షో నిర్వహించారు. నియోజకవర్గం నుంచి వేలాది మంది బీఆర్‌ఎస్ కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు తరలి రావడంతో పట్టణం గులాబీమయమైంది. కేటీఆర్ రోడ్‌షోలో ప్రజలు, వ్యాపారులకు అభివాదం చేస్తూ కదిలారు. బెల్లంపల్లి చౌరస్తాలో కేటీఆర్ మాట్లాడుతూ కేసీఆర్ 24గంటలు కరెంటు ఇస్తుంటే రేవంత్‌రెడ్డి కరెంటు కనబడ్తలేదని అంటుండని, ఎక్కడైనా కరెంటు కనబడ్తదా అని చమత్కరించారు. రేవంత్‌రెడ్డి, ప్రేమ్ సాగర్‌రావు మంచిర్యాలలో ఏ గల్లీకి పోతరో, ఏ ఇంటికి పోతరో పోండ్రి, అక్కడ కరెంటు ఉందో లేదో చూడాలని ఎద్దేవా చేశారు. కరెంటు కష్టాల నుంచి ఇప్పుడే బయటపడ్డామని తెలిపారు. గతంలో ఈ ప్రాంత గోదావరి నది ఎలా ఉండేదని, తమ అభ్యర్థి నడిపెల్లి దివాకర్‌రావు గోదావరి నది వరదల నుంచి కాపాడేందుకు కరకట్టల నిర్మాణం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాడని, ఎందుకు అడుగుతున్నాడంటే ఆ రోజుల్లో కాంగ్రెస్ గోదావరి నదిని ఎండబెడితే, నేడు గోదావరి నది నిండుగా పారేలా చేసింది కేసీఆర్ కాదా అని ప్రశ్నించారు. రామగుండం, మంచిర్యాలను కలిపే గోదావరి నది బ్రిడ్జిపైన నదిలో పైసలు వేయాలంటే నీటి కోసం వెతకాల్సి వచ్చేదని, కానీ ఈ రోజు సముద్రంలాగా గోదావరి ఉందన్నది వాస్తవం కాదా అన్నారు. మంచిర్యాలకు డిగ్రీ, జూనియర్ కళాశాల కావాలంటే ధర్నాలని, 55 ఏళ్ల దరిద్రపు కాంగ్రెస్ పరిపాలనలో కాలేజీలే లేవని, అలాంటిది ఇప్పుడు మంచిర్యాలకు మెడికల్ కాలేజీ, నర్సింగ్ కాలేజీ తెచ్చింది కేసీఆర్ అన్నారు. కరెంటు సక్కగియ్యలే, తాగునీరు, సాగునీరు సక్కగియ్యలే, ఒక కాలేజీ ఇయ్యలే, పల్లె, పట్టణం బాగు చేయలేని వారు నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని విమర్శించారు. రైతుబంధు కావాలంటే దివాకర్‌కు ఓటు వేయాలని, వద్దంటే ఆ రాబందులకు ఓటు వేయాలని సూచించారు.

తెలంగాణను ఆంధ్రాతో కలిపిందే కాంగ్రెస్

1956లో ఉన్న తెలంగాణను ఊడగొట్టిందే కాంగ్రెస్ అని, జవహర్‌లాల్ నెహ్రూ కాదా అని, 1965లో 375 మంది పిల్లలను పిట్టలను కాల్చినట్లు కాల్చింది కాంగ్రెస్ అని, 1971లో 11 మంది ఎంపీలను తెలంగాణ ప్రజలు గెలిపిస్తే, వారందరిని గొర్రెల్లాగా గుంజుకుపోయి కాంగ్రెస్ పార్టీలో కలిపి తెలంగాణ ప్రజల ఆశలను తుంగలో తొక్కింది ఇందిరమ్మ అని, 2004లో సోనియాగాంధీ వచ్చి నమ్మబలికితే 2004 నుంచి 2014 వరకు సావగొట్టి వందల మందిని పొట్టన బెట్టుకుంది కాంగ్రెస్ అని కేటీఆర్ ఆరోపించారు. చిదంబరం మాట్లాడుతూ తెలంగాణలో వందల మంది చావుకు మేమే కారణమని క్షమించాలని అంటున్నాడని, ఆ కాంగ్రెస్‌ను నిజంగానే క్షమిద్దామా అని అన్నారు.

ఖానాపూర్ దత్తత తీసుకుంటా

- తమ్ముడు జాన్సన్‌ను గెలిపించండి
- ఐటీ శాఖ మంత్రి కేటీఆర్
- టైగర్ జోన్ నిబంధనల సడలింపునకు హామీ



సభకు హాజరైన నియోజకవర్గ జనాలు

జన్నారం: 'నా తమ్ముడు జాన్సన్‌నాయక్‌ను భారీ మెజార్టీతో గెలిపిస్తే ఖానాపూర్ నియోజకవర్గాన్ని దత్తత తీసుకుని అభివృద్ధి చేస్తా'నని బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. శుక్రవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా ఖానాపూర్ నియోజకవర్గం జన్నారం మండల కేంద్రంలోని మనోహర్‌రావు మైదానంలో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో ఆయన మాట్లాడారు. అంతకుముందు హెలిప్యాడ్ వద్ద ఎమ్మెల్సీ దండె విఠల్, ఖానాపూర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి భుక్య జాన్సన్ నాయక్, జెడ్పీ చైర్మన్ జనార్దన్‌రాథోడ్, మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాలాచారి, మాజీ ఏపీపీఎస్సీ సభ్యుడు రవీందర్‌రావు కేటీఆర్‌కు స్వాగతం పలికారు. సభలో కేటీఆర్ మాట్లాడుతూ ఖానాపూర్ నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే బీఆర్‌ఎస్ బలపర్చిన జాన్సన్‌నాయక్‌ను గెలిపించాలని కోరారు. అధికారంలోకి వచ్చాక జాన్సన్‌నాయక్ సూచించిన విధంగా జన్నారం ప్రభుత్వ ఆస్పత్రిని 50 పడకల ఆస్పత్రి స్థాయికి పెంచుతామని, డివైడర్లతో సెంట్రల్ లైటింగ్‌సిస్టం ఏర్పాటు చేస్తామని హామీనిచ్చారు. టైగర్‌జోన్ నిబంధనలు సడలించేలా చర్యలు తీసుకుంటామని అన్నారు.

ప్రత్యర్థులపై విసుర్లు

ఓ వైపు హామీలు ఇస్తూనే కేటీఆర్ ప్రత్యర్థులపై విసుర్లు కురిపించారు. రాష్ట్రంలో ఎవ్వరేమి చేసుకున్నా బీఆర్‌ఎస్ అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు. బీజేపీ అభ్యర్థి రాథోడ్ ఏమో చేస్తానని హామీలు ఇస్తున్నా వారితో ఏమీ జరగదని విమర్శించారు. 'కన్నతల్లికి అన్నం పెట్టనోడు, చిన్నమ్మకు బంగారు గాజులు చేయిస్తా' అన్నట్లు బీజేపీ వ్యవహారం ఉందని ఎద్దేవా చేశారు. మతతత్వ పార్టీలను దగ్గరకు రానీయొద్దని, కాంగ్రెస్ పార్టీని నమ్ముకుంటే ప్రతీ విషయానికి ఢిల్లీకి వెళ్లాల్సి ఉంటుందని అన్నారు. టికెట్ల కేటాయింపులో, బీఫాం ఇవ్వడంలో ఢిల్లీకి వెళ్లినట్లు రేపు హామీలు అమలు చేయాలంటే కూడా ఢిల్లీ పెద్దలు చెప్పినట్లు వింటారని అన్నారు.

పోటెత్తిన జనాలు

సభకు బీఆర్‌ఎస్ నాయకుల అంచనా కంటే అధికంగా పోటెత్తారు. నియోజకవర్గంలో 40వేల మంది హాజరవుతారని అంచనా వేయగా 60వేలకు పైగా వచ్చారు. సభలో స్థలం లేకపోవడంతో కొందరు బయట నిల్చోవడం కనిపించింది. సభ విజయవంతంతో పార్టీ శ్రేణుల్లో జోష్ నింపింది.



జాన్సన్‌నాయక్‌తో కలిసి కేటీఆర్ అభివాదం

పార్టీలో చేరికలు

మంత్రి కేటీఆర్ సమక్షంలో కాంగ్రెస్, బీజేపీ, వైఎస్సార్‌టీపీ నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఉట్నూర్ జెడ్పీటీసీ చారులత రాథోడ్, వైఎస్సార్ టీపీ నిర్మల్ జిల్లా అధ్యక్షురాలు సిరికొండ లక్ష్మీ, బీజేవైఎం మంచిర్యాల జిల్లా నాయకుడు కొండపల్లి మహేశ్, మాజీ జెడ్పీటీసీ గణేశ్ రాథోడ్, ఎస్సీసెల్ కన్వీనర్ వీరేందర్, తోటి సంఘం జిల్లా అధ్యక్షుడు రాజేశ్, ఎంపీటీసీ శ్రీదేవి, సిరికొండ కాంగ్రెస్ అధ్యక్షుడు గంగాధర్, కవ్వాల్ ఎంపీటీసీ సౌజన్య, మహ్మద్ సాబీర్, ఆయా పార్టీ నాయకులు పార్టీలో చేరగా కేటీఆర్ కండువా కప్పి ఆహ్వానించారు. ఎంపీ వెంకటేశ్ నేత, ప్రభుత్వ విప్ బాల్క సుమన్, మాజీ ఎమ్మెల్యే గడ్డం అరవింద్‌రెడ్డి, ఎంపీపీ సరోజన, జెడ్పీటీసీలు చంద్రశేఖర్, జానుబాయి, పార్టీ మండల అధ్యక్షుడు గుర్రం రాజారాంరెడ్డి, పొనకల్ సర్పంచ్ జక్కు భూమేశ్, ఉప సర్పంచ్ శ్రీనివాసగౌడ్, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు రియాజొద్దీన్, కోఆప్షన్ సభ్యుడు మున్వర్ అలీఖాన్, పొనకల్ పీఏసీఎస్ చైర్మన్ రమేశ్ వివిధ మండలాల పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సమస్యలు చూడన్న: భుక్య జాన్సన్ నాయక్

ఖానాపూర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి భుక్య జాన్సన్ నాయక్ మాట్లాడుతూ నియోజకవర్గ సమస్యలను కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. సదర్‌మాట్ అభివృద్ధి, కడెం ప్రాజెక్టు పటిష్టత, టైగర్‌జోన్ నిబంధనల సడలింపు, ప్రభుత్వ ఆస్పత్రి స్థాయి పెంపుపై విన్నవించారు. జన్నారం మండలానికి డిగ్రీ కళాశాల, ఐటీఐ కళాశాలకు పక్కా భవనం ఏర్పాటు చేయాలని కోరారు.

పూర్తయిన ర్యాండమైజేషన్

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బి.సంతోష్



మాట్లాడుతున్న కలెక్టర్ బి.సంతోష్

మంచిర్యాలఅగ్రికల్చర్: ఎన్నికల్లో భాగంగా మూడు నియోజకవర్గాలకు పటిష్టమైన భద్రత ఏర్పాట్లు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎంల రెండో విడత ర్యాండమైజేషన్, తరలింపు జరుగుతుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బి.సంతోష్ తెలిపారు. శుక్రవారం నస్పూర్‌లోని సమీకృత కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్, మంచిర్యాల రిటర్నింగ్ అధికారి రాములుతో కలిసి ఎన్నికల విభాగం అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఈవీఎంల రెండో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 743 పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంల కేటాయింపు, తరలింపు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. చెన్నూర్ నియోజకవర్గానికి 46 మంది ప్రిసైడింగ్ అధికారులు, 46 మంది సహాయ ప్రిసైడింగ్ అధికారులు, 92 మంది ఇతర ప్రిసైడింగ్ అధికారులు, మంచిర్యాలకు 58 మంది ప్రిసైడింగ్ అధికారులు, 58 మంది సహాయ ప్రిసైడింగ్ అధికారులు, 116 మంది ఇతర ప్రిసైడింగ్ అధికారులను నియమించామని తెలిపారు.

సూక్ష్మ పరిశీలకుల పాత్ర కీలకం

మంచిర్యాలఅగ్రికల్చర్: ఈ నెల 30న జరిగే పోలింగ్‌లో సూక్ష్మ పరిశీలకుల పాత్ర కీలకమని కలెక్టర్ సంతోష్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో లీడ్ బ్యాంక్ డిస్ట్రిక్ మేనేజర్ తిరుపతి, జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి రమేష్‌తో కలిసి సూక్ష్మ పరిశీలకుల శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో సూక్ష్మ పరిశీలకులను నియమిస్తామని తెలిపారు. సమస్యలపై తక్షణమే స్పందిస్తారని తెలిపారు.

పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవాలి

మంచిర్యాలఅగ్రికల్చర్: అధికారులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని కలెక్టర్ సంతోష్ తెలిపారు. ఎన్నికల ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్, పోలింగ్, సహాయ పోలింగ్ అధికారులు, సూక్ష్మ పరిశీలకులు, డ్రైవర్లు ఎన్నికల విధుల్లో పాల్గొనే ఇతర అధికారులు పోస్టల్ బ్యాలెట్ వినియోగానికి రెండ్రోజుల్లో పత్రాలు సమర్పించాలని తెలిపారు.

శతాబ్ది వేడుకలు విజయవంతం చేయాలి

లక్సెట్టిపేట: మున్సిఫ్ మేజిస్ట్రేట్ కోర్టు శతాబ్ది ఉత్సవాల వేడుకలు విజయవంతం చేయాలని జూనియర్ సివిల్ జడ్జి మహ్మద్ అసదుల్లా షరీఫ్ అన్నారు. స్థానిక కోర్టు ఏర్పాటు చేసి వంద సంవత్సరాలు అవుతున్నందున కోర్టులో శతాబ్ది వేడుకలను ఈ నెల 18నుంచి ప్రారంభిస్తున్నామని, కోర్టు ఆవరణలో న్యాయపరమైన విషయాలపై సీనియర్ న్యాయవాదులు చర్చిస్తారని పేర్కొన్నారు. బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొని విజయవంతం చేయాలని తెలిపారు.

ఇప్పటికే పెండింగ్.. మళ్లీ ధాన్యం



కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ ప్రారంభించిన అధికారులు

- నాలుగు సీజన్ల సీఎంఆర్ తాత్సారం
- వానాకాలం ధాన్యం సేకరణ చేపట్టిన అధికారులు
- గోదాముల్లోనే మగ్గుతున్న ధాన్యం
- సీఎంఆర్ ఇవ్వడంలో మిల్లర్ల నిర్లక్ష్యం

మంచిర్యాలఅగ్రికల్చర్: రైతుల నుంచి సేకరించిన ధాన్యం సీఎంఆర్ అప్పగించకుండా మిల్లర్లు తీవ్ర జాప్యం చేస్తున్నారు. వివిధ ఏజెన్సీలు సేకరించిన ధాన్యాన్ని మిల్లులకు తరలించడంతోపాటు ప్రభుత్వ గోదాముల్లో వేల క్వింటాళ్లు మగ్గిపోతోంది. మిల్లర్ల వద్ద ఉన్న ధాన్యం, గోదాములో నిల్వ చేసిన ధాన్యం మిల్లులకు కేటాయించినా తరలింపు ముందుకు సాగడం లేదు. మరోవైపు ప్రస్తుత వానాకాల సీజన్ ధాన్యం సేకరణ చేపట్టారు. మిల్లులకు తరలించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. 2021-22 వానాకాలం, యాసంగి సీజన్, గత 2022-23 వానాకాలం, యాసంగి సీజన్‌కు సంబంధించి 1.14లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం సీఎంఆర్ ఇవ్వాల్సి ఉంది. సీఎంఆర్‌పై ఇప్పటికే ప్రభుత్వం మిల్లర్లకు పలుమార్లు గడువు విధించడంతోపాటు డిఫాల్ట్ కింద చేర్చడంతో రూ.51కోట్ల వరకు జరిమానా విధించింది. జరిమానాకు బదులు బియ్యం ఇస్తామంటూ ప్రభుత్వం బేరసారాలకు దిగినట్లు తెలుస్తోంది.

నాలుగు సీజన్ల ధాన్యం..

2021-22 వానాకాలం సీజన్‌లో 1,37,180 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించి మిల్లులకు తరలించారు. 91,910 మెట్రిక్ టన్నులు సీఎంఆర్ ఇవ్వాల్సి ఉండగా 90,188 మెట్రిక్ టన్నుల బియ్యం అందించారు. ఇంకా 1,663 మెట్రిక్ టన్నులు అందించాల్సి ఉంది. యాసంగిలో 1,01,720 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించగా 52,649 మెట్రిక్‌టన్నుల సీఎంఆర్ ఇవ్వాల్సి ఉండగా 37,676 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ ఇచ్చారు. ఇంకా 14,754 మెట్రిక్ టన్నులు అందించాల్సి ఉంది.

- 2022-23 సీజన్‌లో 1,19,177 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించగా 79,934 సీఎంఆర్ ఇవ్వాల్సి ఉంది. 32,102 మెట్రిక్ టన్నులు సీఎంఆర్ అందించారు. ఇంకా 47,555 మెట్రిక్ టన్నుల బియ్యం అందించాల్సి ఉంది. గత యాసంగి సీజన్‌కు సంబంధించి 61,958 మెట్రిక్ టన్నుల ధాన్యం మిల్లులకు తరలించగా ఇప్పటివరకు 11,298 మెట్రిక్ టన్నుల బియ్యం మాత్రమే ఎఫ్‌సీఐకి అందించారు. ఇంకా 50,631 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యం ఎఫ్‌సీఐకి అందించాల్సి ఉంది.

ఈ వానాకాలం 223 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం

ఈ వానాకాలంలో 1.57 లక్షల ఎకరాల్లో వరి సాగు కాగా, 3.20లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. ఇందులో రైతుల అవసరాలకు పోను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు 2.23లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అంచనా వేశారు. ధాన్యం సేకరణ లక్ష్యానికి అనుగుణంగా కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తున్నారు. ఈ ధాన్యం కేంద్రాలకు మిల్లులకు ట్యాగింగ్ చేసి తరలించేందుకు అధికారులు సిద్ధం చేశారు. పెండింగ్‌లో ఉన్న సీఎంఆర్ ధాన్యంతోపాటు ప్రస్తుతం సేకరిస్తున్న ధాన్యం సీఎంఆర్ లక్ష్యం ఏ మేరకు నెరవేరుతుందో చూడాలి.

తరచూ గడువు పెంపు

పీఏసీఎస్, డీఆర్‌డీఏ, డీసీఎమ్మెఎస్ కొనుగోలు కేంద్రాలకు ద్వారా ధాన్యం సేకరించి జిల్లాలోని రైస్ మిల్లుకు కేటాయిస్తున్నారు. క్వింటాలు ధాన్యానికి రైస్‌మిల్లర్లు 68 కిలోల బియ్యాన్ని ప్రభుత్వానికి ఇవ్వాల్సి ఉంటుంది. ఇలా వచ్చిన బియ్యాన్ని ఎఫ్‌సీఐకి తరలించాల్సి ఉంటుంది. మిల్లర్లకు కేటాయించిన ధాన్యాన్ని బియ్యంగా చేసిన తర్వాత తిరిగి అప్పగించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నా.. అధికారులు చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. మిల్లర్ల కు లక్ష్యం మేరకు ధాన్యం కేటాయించడం, బియ్యం ఇవ్వడంలో నిర్లక్ష్యం వహించడం, గడువు మీద గడువు పెంచడం.. ఇదే జరుగుతోంది.

గత వానాకాలం లక్ష్యమే పూర్తికాలె..

కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించి ధాన్యం మిల్లులకు తరలించిన 40 రోజుల్లోగా బియ్యంగా మార్చి ప్రభుత్వానికి తిరిగి ఇవ్వాల్సి ఉంటుంది. గత ఏడాది వానాకాలం సీజన్ మిల్లులకు కేటాయించిన ధాన్యానికి సంబంధించి ఇప్పటివరకు 50 శాతం పూర్తి చేసినట్లు తెలుస్తోంది. గత యాసంగి సీజన్‌కు సంబంధించి 17శాతం మాత్రమే బియ్యాన్ని మిల్లర్లు అప్పగించారు. జిల్లాలో రైస్‌మిల్లుల్లో స్థలం లేక జన్నారం, దండేపల్లి, భీమారం, కోటపల్లి, చెన్నూర్, వేమనపల్లి, కాసిపేట, తాండూర్ మండలాల్లోని ప్రభుత్వ గోదాముల్లో 23,955 మెట్రిక్ టన్నుల ధా న్యం నిల్వ చేశారు. ఇందులో ఇప్పటివరకు 14,630 మెట్రిక్ టన్నులు మిల్లులకు తరలించారు. ఇంకా వేల మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వలు గోదాముల్లోనే ఉన్నాయి. ప్రభుత్వం గడువులోగా సీఎంఆర్ పూర్తి చేయాలని ఆదేశిస్తున్నా గోదాముల్లో ధాన్యం కదలడం లేదు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి

బెల్లంపల్లి: వయోజనులు ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి బి.రాహుల్ అన్నారు. శుక్రవారం కాంటా చౌరస్తాలో వీవీ ప్యాట్‌ల వినియోగం, పనితీరుపై ఓటర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రాహుల్ మాట్లాడుతూ ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించడానికి ఎన్నికల సంఘం వీవీ ప్యాట్‌లను అందుబాటులోకి తెచ్చిందని తెలిపారు. వీవీ ప్యాట్ బటన్ నొక్కగానే పోటీ చేస్తున్న అభ్యర్థి ఫొటో వస్తుందని, నచ్చిన అభ్యర్థికి ఓటు వేశామో లేదో తెలిపేలా బల్బ్ వెలుగుతుందని వివరించారు. గతంలో కన్నా ఈసారి పోలింగ్ శాతాన్ని పెంచాలని సూచించారు. సమస్యాత్మక నియోజకవర్గంగా గుర్తించిన బెల్లంపల్లిలో ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభమై సాయంత్రం 4 గంటలకే ముగుస్తుందని తెలిపారు.



అవగాహన కల్పిస్తున్న ఆర్వో రాహుల్

పోల్ చిట్టీల పంపిణీ పరిశీలన

బెల్లంపల్లి మున్సిపాలిటీలో పోల్ చిట్టీల పంపిణీని ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాహుల్ ఆకస్మికంగా పరిశీలించారు. నిర్దేశించిన గడువులోగా పోల్ చిట్టీలను ఓటర్లకు అందించాలని బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్లను ఆదేశించారు. ఆయా కార్యక్రమాల్లో బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ, తహసీల్దార్లు సుధాకర్, దేశ్ పాండే రోహిత్, డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్, కళాకారులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం

జైపూర్: మండలంలోని షెట్‌పల్లి, బెజ్జాల గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను డీఆర్‌డీఏ అడిషనల్ పీడీ శ్రీనివాస్ శుక్రవారం ప్రారంభించారు. కొనుగోలు కేంద్రాల ద్వారా ఏ-గ్రేడ్ వరి ధాన్యానికి రూ.2203, సాధారణ వరి ధాన్యానికి బీ గ్రేడ్ రూ.2183 మద్దతు ధర కల్పిస్తున్నట్లు తెలిపారు. రైతులు దళారుల వద్ద ధాన్యం విక్రయించి మోసపోవద్దని, కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జీపీఎం వేణు, ఏపీఎం రాజ్‌కుమార్, సీసీలు, వీవో అధ్యక్షులు, రైతులు పాల్గొన్నారు.



షెట్‌పల్లిలో కేంద్రాన్ని ప్రారంభిస్తున్న శ్రీనివాస్

భక్తి శ్రద్ధలతో నాగుల చవితి

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల పట్టణంలో నాగుల చవితి పూజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. శుక్రవారం నాగుల చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని తెల్లవారుజాము నుంచే పుట్టల వద్ద మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. హమాలీవాడ చెరువు కట్ట నాగేంద్ర ఆలయం, గౌతమినగర్, పాత మంచిర్యాల తదితర ప్రాంతాల్లో పుట్టలో పాలు పోసి నాగేంద్రునికి మొక్కులు తీర్చుకున్నారు.



హమాలీవాడ నాగేంద్ర ఆలయంలో పూజలు

సగానికి పైగా విద్యావంతులే..



- ప్రజాసేవ కోసమే రాజకీయాల్లోకి..
- గెలిచి అభివృద్ధి చేయాలని తలచి వివిధ పార్టీల నుంచి బరిలోకి..

మంచిర్యాలటౌన్: వారంతా విద్యాధికులే.. ఉన్నత లక్ష్యంతో డిగ్రీ, పీజీ, ఎల్ఎల్బీ పూర్తి చేసినవారే. వివిధ వృత్తులు, వ్యాపారాలు చేస్తూనే ప్రజాసేవ చేసేందుకు రాజకీయాల్లోకి వచ్చారు. ఆయా పార్టీలో చేరి ప్రస్తుతం అసెంబ్లీ బరిలో నిలిచారు. పార్టీ అభ్యర్థులుగా, స్వతంత్రులుగా తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు.

మంచిర్యాల నియోజకవర్గంలో..

మంచిర్యాల నియోజకవర్గంలో పోటీ చేస్తున్న వివిధ పార్టీల అభ్యర్థులతో పాటు స్వతంత్రులు 17 మంది బరిలో నిలువగా ఇందులో సగానికి పైగా ఉన్నత విద్యను అభ్యసించినవారే. ప్రధాన పార్టీల అభ్యర్థులు డిగ్రీ, ఆపైన చదివిన వారుండగా, ఉన్నత చదువు చదివి, మంచి ఉద్యోగాలు, వృత్తుల్లో ఉన్నవారు ప్రజాసేవ చేసేందుకు ఎన్నికల బరిలో నిలిచారు. వీరిలో 25 నుంచి 71 ఏళ్లవారున్నారు. వయస్సు, చదువుతో నిమిత్తం లేకుండా రాజకీయాల్లో రాణిస్తున్న వారెందరో ఉండగా, మంచిర్యాల నియోజకవర్గంలో మాత్రం ఉన్నత చదువులతో పాటు, మంచి వృత్తిలో ఉన్నవారు కూడా ఈసారి ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిచి, ప్రజాసేవ చేసేందుకు సిద్ధమవుతున్నారు. 51 ఏళ్లున్న బీజేపీ అభ్యర్థి రఘునాథ్ వెరబెల్లి అమెరికా యూనివర్సిటీలో ఎంబీఏ పూర్తి చేశారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేసి పలు కంపెనీలను నెలకొల్పారు. ప్రస్తుతం ప్రజాసేవ చేసేందుకు ఎన్నికల బరిలో నిలిచారు. 63 ఏళ్లున్న కాంగ్రెస్ అభ్యర్థి కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు బీఎస్సీ చదివి వ్యాపారం చేస్తున్నారు. 71 ఏళ్లున్న బీఆర్ఎస్ అభ్యర్థి నడిపెల్లి దివాకర్‌రావు బీఏ చదివారు. నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొంది ప్రజాసేవ చేస్తున్నారు. 41 ఏళ్లున్న బీఎస్పీ అభ్యర్థి తోట శ్రీనివాస్ బీఎస్సీ చదివి ఆర్ఎంపీగా, నస్పూర్ మున్సిపల్ వైస్ చైర్మన్‌గా కొనసాగుతున్నారు. 48 ఏళ్లున్న బహుజన రిపబ్లికన్ సోషలిస్ట్ పార్టీ అభ్యర్థి చెరుకూరి శాంతశ్రీ ఎమ్మెస్సీ ఎల్ఎల్బీ చదివి సోషల్ వర్క్ చేస్తున్నారు. 39 ఏళ్లున్న ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థి దొమ్మటి రవికుమార్ ఎమ్మెస్సీ చదివి వ్యవసాయం చేస్తూ బరిలో నిలిచారు.

బెల్లంపల్లి నియోజకవర్గంలో..

బెల్లంపల్లి: బెల్లంపల్లి బరిలో ప్రధాన పార్టీల అభ్యర్థులు నలుగురు తలపడుతున్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీ అభ్యర్థులుగా దుర్గం చిన్నయ్య, గడ్డం వినోద్, అమురాజుల శ్రీదేవి, జాడి నర్సయ్య పోటీలో ఉన్నారు. చిన్నయ్య, గడ్డం వినోద్, శ్రీదేవి ఇదివరకే ఎమ్మెల్యేలుగా గెలిచి చట్టసభలో అడుగు పెట్టారు. 52 ఏళ్లున్న బీఆర్ఎస్ అభ్యర్థి దుర్గం చిన్నయ్యది వ్యవసాయ కుటుంబం. ఐటీఐ చదివి రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. భార్య, ఇద్దరు కుమార్తెలు కలిగిన చిన్నయ్య మూడోసారి బరిలో ఉన్నారు. 67 ఏళ్లున్న కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వినోద్ రాజకీయ, పారిశ్రామిక కుటుంబంలో జన్మించారు. డిగ్రీ చదివిన వినోద్‌కు భార్య, కుమార్తె ఉన్నారు. చెన్నూర్ నియోజకవర్గం నుంచి రెండుసార్లు పోటీ ఓసారి విజయం సాధించారు. ప్రస్తుతం బెల్లంపల్లి నుంచి రెండోసారి పోటీ చేస్తున్నారు. 51 ఏళ్లున్న బీజేపీ అభ్యర్థి అమురాజుల శ్రీదేవి సాధారణ కుటు ంబంలో జన్మించారు. డిగ్రీ వరకు చదివారు. ఆమె భర్త రాజేశ్వర్ సింగరేణిలో అధికారిగా పని చేస్తున్నారు. ఆమెకు నలుగురు సంతానం. మూడుసార్లు ఎన్నికల్లో పోటీ చేసిన శ్రీదేవి పాత ఆసిఫాబాద్ నియోజకవర్గం నుంచి ఒకసారి ఎమ్మెల్యేగా గెలిచారు. ప్రస్తుతం నాలుగోసారి బరిలో ఉన్నారు.

నిర్మల్ నియోజకవర్గంలో..

నిర్మల్‌ఖిల్లా/భైంసాటౌన్: 74 ఏళ్లున్న నిర్మల్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి ఎల్ఎల్బీ పూర్తిచేసి న్యాయవాద వృత్తి స్వీకరించిన తర్వాత రాజకీయాల్లోకి ప్రవేశించారు. 54 ఏళ్లున్న బీజేపీ అభ్యర్థి ఏలేటి మహేశ్వర్‌రెడ్డి డిగ్రీ పూర్తి చేశారు. 62 ఏళ్లున్న కాంగ్రెస్ అభ్యర్థి కూచాడి శ్రీహరిరావు ఎల్ఎల్బీ పూర్తి చేసి కొంతకాలం న్యాయవాద వృత్తిలో ఉండి రాజకీయాల్లోకి వచ్చారు. అలాగే బీఎస్పీ అభ్యర్థి డీ జగన్మోహన్ ఎల్ఎల్బీ, ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థి స్వదేశ్ పరికిపండ్ల, యుగ తులసి, ధర్మ సమాజ్, అలయన్స్ ఆఫ్ డెమొక్రటిక్ రీఫామ్స్ అభ్యర్థులు, స్వతంత్రులుగా బరిలో నిలిచిన వారంతా డిగ్రీ, పీజీ పూర్తి చేసినవారే.

ముధోల్ నియోజకవర్గంలో..

69 ఏళ్లున్న బీఆర్ఎస్ అభ్యర్థి గడ్డిగారి విఠల్‌రెడ్డి ఎల్ఎల్బీ పూర్తి చేసి దాదాపు 20 ఏళ్ల పాటు భైంసాలో న్యాయవాదిగా పనిచేశారు. భైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా చేశారు. 2009లో పీఆర్పీ నుంచి పోటీ చేసి ఓడిపోయిన విఠల్‌రెడ్డి, 2014లో కాంగ్రెస్ నుంచి పోటీచేసి గెలుపొందారు. తర్వాత బీఆర్ఎస్‌లో చేరి, 2018లో గెలిచారు. 64 ఏళ్లున్న కాంగ్రెస్ అభ్యర్థి భోస్లే నారాయణరావుపటేల్ ఇంటర్ పూర్తి చేశారు. ముధోల్ ఎమ్మెల్యేగా రెండుసార్లు పని చేశారు. 69 ఏళ్లున్న బీజేపీ అభ్యర్థి పవార్ రామారావుపటేల్ డిగ్రీ పూర్తి చేశారు. 2018లో కాంగ్రెస్‌లో చేరి ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చారు. అదే ఏడాది ముధోల్ బరిలో నిలిచి కాంగ్రెస్ నుంచి పోటీ చేసి ఓడిపోయారు. తదనంతరం డీసీసీ అధ్యక్షుడిగా కొనసాగుతూ గతేడాది బీజేపీలో చేరారు.

సిర్పూర్ నియోజకవర్గంలో..

కౌటాల: 68 ఏళ్లున్న సిర్పూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి కోనేరు కోనప్ప ఇంటర్ వరకు కాగజ్‌నగర్‌లో చదివారు. 48 ఏళ్లున్న కాంగ్రెస్ అభ్యర్థి రావి శ్రీనివాస్ 1 నుంచి 10వ తరగతి వరకు కాగజ్‌నగర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసించారు. హైదరాబాద్‌లో ఇంటర్, డిగ్రీ బీఏ చదివారు. 44 ఏళ్లున్న బీజేపీ అభ్యర్థి పాల్వాయి హరీశ్‌బాబు కాగజ్‌నగర్‌లోని ఫాతిమా కాన్వెంట్‌లో ప్రాథమిక విద్య పూర్తి చేశారు. 2004లో ఎంబీబీఎస్, 2010లో ఎంఎస్(ఆర్థోసిడిక్స్) పూర్తి చేశారు. 2011లో నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ నుంచి డీఎన్‌బీ పట్టా పొందారు. 56 ఏళ్లున్న బీఎస్పీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ 1 నుంచి 10వ తరగతి వరకు ఆలంపూర్‌లోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో పూర్తి చేశారు. వెటర్నరీ వైద్య వృత్తి కోర్సును హైదరాబాద్ ఎన్జీరంగ యూనివర్సిటీలో చదివారు. 1995లో ఐపీఎస్‌గా ఎంపికయ్యారు. హార్వర్డ్ యూనివర్సిటీ ఇన్ పబ్లిక్‌లో ఉన్నత చదువు పూర్తిచేశారు. 2020 ఆగస్టు 8న తన ఉద్యోగానికి రాజీనామా చేసి బీఎస్పీలో చేరి రాష్ట్ర అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు.

ఆసిఫాబాద్ నియోజకవర్గంలో..

ఆసిఫాబాద్‌అర్బన్: 54 ఏళ్లున్న ఆసిఫాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి కోవ లక్ష్మి పదో తరగతి చదివారు. 36 ఏళ్లున్న బీజేపీ అభ్యర్థి అజ్మీరా ఆత్మారాంనాయక్ బీఎస్సీ(బీజెడ్సీ), మాస్టర్ ఆఫ్ సోషల్ వర్క్స్ విద్యనభ్యసించారు. 53 ఏళ్లున్న కాంగ్రెస్ అభ్యర్థి అజ్మీరా శ్యాంనాయక్ బీఈ, బ్యాచ్‌లర్ ఆఫ్ జర్నలిజం (ఉస్మానియా), ఎల్ఎల్బీ శాతవాహన యూనివర్సిటీలో పూర్తిచేశారు. ఎంపీఐగా పనిచేసి ప్రజాసేవ చేసేందుకు కాంగ్రెస్‌లో చేరారు. ఆయన భార్య రేఖానాయక్ ఖానాపూర్ ఎమ్మెల్యే.

కారు జోరా?.. 'హస్త'గతమా?

- కార్మికుల అండ ఏ జెండాకు?
- సింగరేణి పరిధిలో 11 స్థానాలు
- గత ఎన్నికల్లో ఆరు 'హస్త'గతం.. మూడు స్థానాల్లో కారు గెలుపు
- ఈసారి పాగా వేసే పార్టీ ఏదో!



శ్రీరాంపూర్: ఉద్యమాల పురిటిగడ్డగా పేరున్న సింగరేణిలో కార్మికవర్గం ఎప్పుడూ విలక్షణమైన తీర్పు ఇస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల్లో ఏ పార్టీ హవా ఎలా ఉన్నా కార్మిక క్షేత్రాలకు వచ్చేసరికి పరిస్థితి భిన్నంగా ఉంటోంది. దీనికి గత 2018 అసెంబ్లీ ఎన్నికల ఫలితాలే నిదర్శనం. నాటి అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ అంతటా కారు జోరు కొనసాగినా కోల్‌బెల్ట్ ప్రాంతానికి వచ్చేసరికి భిన్నమైన తీర్పు వచ్చింది. నాడు ఈ ఫలితాలు చూసి అందరూ ఆశ్చర్యపోయారు. ఆ ఎన్నికల్లో కోల్‌బెల్ట్ మెజార్టీ సీట్లు కాంగ్రెస్ హస్తగతం చేసుకుంది. ఈసారి తీర్పు ఎలా ఉంటుంది? ఏ పార్టీకి పట్టం కడతారు? అని అంతటా చర్చ సాగుతోంది. కార్మికుల అండ ఏ జెండాకు ఉంటుందనే దానిపై పార్టీలన్నీ దృష్టి సారించి ప్రచారం ముమ్మరం చేస్తున్నాయి. పార్టీలు.. వాటి అనుబంధ కార్మిక సంఘాలకు సింగరేణిలో ఉన్న బలంతో గట్టెక్కడానికి ప్రయత్నం చేస్తున్నాయి. ఈ క్రమంలో గత వైభవాన్ని కాపాడుకోవడం కోసం కాంగ్రెస్, గులాబీ మయం చేయడానికి బీఆర్ఎస్ తీవ్ర ప్రయత్నం చేస్తున్నాయి

ఆరు జిల్లాలు.. 11 స్థానాలు..

తెలంగాణలో సింగరేణి ఆరు జిల్లాల్లో విస్తరించి ఉంది. 11 అసెంబ్లీ స్థానాల్లో ప్రత్యక్షంగా, మరో మూడు అసెంబ్లీ స్థానాల్లో పరోక్షంగా సింగరేణి ఓటర్లు అభ్యర్థుల గెలుపోటములను ప్రభావితం చేస్తారు. గత 2018 అసెంబ్లీ ఎన్నికల్లో 11 స్థానాల్లో మూడు స్థానాల్లో మాత్రమే బీఆర్ఎస్ గెలిచింది. ఆరు స్థానాలను కాంగ్రెస్ హస్తగతం చేసుకుంది. మిగతా రెండింటిని టీడీపీ, ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ కైవసం చేసుకున్నాయి. వీరిలో కాంగ్రెస్ నుంచి గెలిచిన తర్వాత మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మినహా మిగతా వారంతా ఆ పార్టీని వీడి కారెక్కారు. నాడు కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన వారే నేడు బీఆర్ఎస్ నుంచి పోటీలో నిలవడం కొసమెరుపు. ఈ నేపథ్యంలో పార్టీ మారిన అభ్యర్థుల బలం గెలుస్తుందా? పార్టీ బలం గెలుస్తుందా? అన్నది తేలాల్సి ఉంది.

చేసిన మేలే గెలిపిస్తుందని బీఆర్ఎస్..

కార్మికులకు తమ హయాంలో చేసిన మేలు, కల్పించిన హక్కులు, సదుపాయల గురించి బీఆర్ఎస్ నేతలు ప్రచారంలో వివరిస్తున్నారు. కార్మికుల చిరకాల కోరిక అయిన కారుణ్య ఉద్యోగాల కల్పన, టీబీజీకేఎస్ సాధించిన విజయాలు లాభం చేస్తాయని బీఆర్ఎస్ నాయకత్వం విశ్వసిస్తోంది. ఆదాయ పన్ను కూడా మాఫీ చేయిస్తానని ఇటీవల మందమర్రిలో జరిగిన సభలో సీఎం కేసీఆర్ హామీ ఇచ్చి కార్మికుల ఓట్లు రాబట్టే ప్రయత్నం చేశారు. కాంగ్రెస్ సింగరేణికి చేసిన అన్యాయాన్నే బీఆర్ఎస్ నేతలు నేటి ప్రచారంలో ఏకరువు పెడుతున్నారు. అందుకే కేసీఆర్ సింగరేణి మంచిర్యాల, కొత్తగూడెంలో ఇటీవల నిర్వహించిన సభల్లో సింగరేణి ఓట్లు రాబట్టేందుకు తన ఉపన్యాసంలో నాటి సింగరేణి దుస్థితికి కారణం కాంగ్రెస్ అని, కాంగ్రెస్‌తోనే సింగరేణిలో 49 శాతం వాటా కేంద్రానిది అయ్యిందంటూ తూర్పారబడుతున్నారు.

పూర్వవైభవం కోసం కాంగ్రెస్..

2018 ఎన్నికల్లో సింగరేణి ఆరు జిల్లాల్లో గెలిచిన మూడు బీఆర్ఎస్ స్థానాలు కూడా మంచిర్యాల జిల్లా నుంచి కావడం విశేషం. బెల్లంపల్లి, చెన్నూరు, మంచిర్యాల స్థానాలు మినహా మిగతా చోట్ల బీఆర్ఎస్ గెలవలేదు. కొత్త గనులు రాకపోవడం, సింగరేణిలో జరుగుతున్న ప్రైవేటీకరణ, సంస్థలో పెరిగిన రాజకీయ జోక్యం, రూ.వేల కోట్లు ప్రభుత్వ సంస్థలు సింగరేణికి బాకీ పడటం తదితర సమస్యలను కాంగ్రెస్ ఏకరువు పెట్టి గత వైభవాన్ని కాపాడుకునేలా ప్రచారం చేస్తోంది. కాగా, ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న తీవ్ర పోటీలో ప్రస్తుతం ఈ 11 స్థానాలు కూడా ప్రభుత్వ ఏర్పాటులో కీలకపాత్ర పోషించే అవకాశం కూడా లేకపోలేదు. ఈ తరుణంలో కార్మికులు ఇచ్చే తీర్పు ఎంతో కీలకం కానుంది.

వివిధ పార్టీల నుంచి గెలిచి కారెక్కి..

గత ఎన్నికల్లో వివిధ పార్టీల నుంచి గెలిచిన నేతలు ప్రస్తుతం బీఆర్ఎస్‌లో కొనసాగుతున్నారు. ఆసిఫాబాద్‌లో కాంగ్రెస్ నుంచి గెలిచిన ఆత్రం సక్కు, రామగుండంలో ఫార్వర్డ్ బ్లాక్ నుంచి విజయం సాధించిన కోరుకంటి చందర్, భూపాలపల్లిలో కాంగ్రెస్ నుంచి గెలిచిన గండ్ర వెంకటరమణారెడ్డి, కొత్తగూడెంలో కాంగ్రెస్ నుంచి విజయం సాధించిన వనమా వెంకటేశ్వర్‌రావు, ఇల్లందులో కాంగ్రెస్ నుంచి గెలిచిన బానోత్ హరిప్రియ, పినపాకలో కాంగ్రెస్ నుంచి విజయం సాధించిన రేగా కాంతారావు, సత్తుపల్లిలో టీడీపీ నుంచి గెలిచిన సండ్ర వెంకటవీరయ్య ప్రస్తుతం బీఆర్ఎస్‌లో కొనసాగుతున్నారు.

2018లో అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు

నియోజకవర్గం	పార్టీ	గెలిచిన అభ్యర్థి
ఆసిఫాబాద్	కాంగ్రెస్	ఆత్రం సక్కు
బెల్లంపల్లి	బీఆర్ఎస్	దుర్గం చిన్నయ్య
చెన్నూరు	బీఆర్ఎస్	బాల్క సుమన్
మంచిర్యాల	బీఆర్ఎస్	ఎన్.దివాకర్‌రావు
రామగుండం	ఫార్వర్డ్ బ్లాక్	కోరుగంటి చందర్
మంథని	కాంగ్రెస్	దుద్దిళ్ల శ్రీధర్‌బాబు
భూపాలపల్లి	కాంగ్రెస్	గండ్ర వెంకటరమణారెడ్డి
కొత్తగూడెం	కాంగ్రెస్	వనమా వెంకటేశ్వర్‌రావు
ఇల్లందు	కాంగ్రెస్	బానోత్ హరిప్రియ
పినపాక	కాంగ్రెస్	రేగా కాంతారావు
సత్తుపల్లి	టీడీపీ	సండ్ర వెంకటవీరయ్య

మీకు తెలుసా?

చాలెంజ్ ఓటు అంటే..?

మంచిర్యాలరూరల్(హాజీపూర్): 'ఛాలెంజ్ ఓటు' (సవాల్ ఓటు) అనేది ఒకటి ఉంది అనేది మీకు తెలుసా?.. ఎన్నికల్లో ఎంతో కొంత ప్రభావితం చేసే 'చాలెంజ్ ఓటు' అంటే ఇప్పటికీ చాలామందికి తెలియదు. ఓటరు జాబి తాలో పేరున్నా.. ఓటు వేసేందుకు అనర్హుడని రాజకీయ పార్టీల ఏజెంట్లు సవాల్ చేయడాన్ని చాలెంజ్ ఓటు అంటారు. పోలింగ్ కేంద్రంలో కొంత మంది ఏజెంట్లు ఆ వ్యక్తి బోగస్ అని పోలింగ్ అధికారికి తెలియజేస్తారు. సదరు అధికారి ఫిర్యాదును పరిశీలించి ఏజెంట్ నుంచి రూ.5 ఫీజు తీసుకుని రసీదు ఇస్తారు. స్థానిక సిబ్బందితో ప్రాథమిక విచారణ జరిపిస్తారు. కాగా, ఓటరు జాబితాలో అతడి పేరు, ఫొటో ఇతర వివరాలు సక్రమంగా ఉంటే ఓటు వేసేందుకు అర్హుడని తేలితే ఎన్నికల అధికారులు అనుమతిస్తారు. బోగస్ అని తేలితే మాత్రం అధికారులు అతడిపై క్రిమినల్ కేసు నమోదు చేస్తారు.

'ఎస్సీలను వర్గీకరిస్తే ఊరుకోం'



ఐక్యత చాటుతున్న మాల సంఘం నాయకులు

బెల్లంపల్లి: ఎస్సీలను వర్గీకరిస్తే కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీకి తగిన బుద్ధి చెబుతామని మాల ప్రజాసంఘాల రాష్ట్ర జేఏసీ చైర్మన్ జీ చెన్నయ్య పేర్కొన్నారు. శుక్రవారం బెల్లంపల్లిలోని కాంటా చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చెన్నయ్య మాట్లాడుతూ.. బీజేపీ కులరాజకీయాలకు పాల్పడుతోందని ఆరోపించారు. ఎస్సీ వర్గీకరణ చేస్తామని మాయమాటలు చెప్పి అసెంబ్లీ ఎన్నికల్లో లబ్ధిపొందాలని చూస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. మాల ప్రజాసంఘాల వర్కింగ్ చైర్మన్లు బూర్గుల వెంకటేశ్వర్లు, రమేశ్, శ్రీధర్‌రావు, సత్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు కుంబాల రాజేశ్, వర్కింగ్ ప్రసిడెంట్ బూపెల్లి మల్లయ్య, ప్రధాన కార్యదర్శి యాదగిరి, నాయకులు మధుకర్, మధు, ప్రభాకర్, ప్రతాప్, మురళి, జనార్దన్, ప్రదీప్, తిరుపతి తదితరులున్నారు.

క్లుప్తంగా

తాగిన మైకంలో ఉరేసుకుని ఆత్మహత్య

రెబ్బెన(ఆసిఫాబాద్): మండల కేంద్రానికి చెందిన మిట్ట రామయ్య (45) తాగిన మైకంలో గురువారం రాత్రి తన ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. లారీ డ్రైవర్‌గా పని చేసే రామయ్యకు 20 ఏళ్ల క్రితం నారాయణపూర్‌కు చెందిన శారదతో వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. కొంతకాలంగా మద్యానికి బానిసైన రామయ్య రోజూ తన తల్లితోపాటు భార్యాపిల్లలతో గొడవపడేవాడు. ఇది భరించలేని శారద తన ఇద్దరు పిల్లలను నారాయణపూర్‌లోని తన పుట్టింటికి పంపించింది. అయినప్పటికీ రామయ్యలో ఎలాంటి మార్పు రాలేదు. దీంతో ఇటీవల అతడి తల్లి మరో కొడుకు ఇంటికి వెళ్లగా, శారద కూడా భర్తను వదిలి నారాయణపూర్‌లోని తన పుట్టింటికి వెళ్లిపోయింది. గురువారం శారద తిరిగి భర్త వద్దకు రాగా, ఇంట్లో ఉన్న టీవీ, ఫ్రిజ్ తదితర సామగ్రి ధ్వంసమై ఉంది. ప్రశ్నించిన శారదను అప్పటికే మద్యం సేవించిన రామయ్య చితకబాదాడు. దీంతో శారద స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా రామయ్యపై కేసు నమోదైంది. ఈక్రమంలో తాగిన మైకంలో జీవితంపై విరక్తి చెందిన రామయ్య గురువారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గంజాయి విక్రేత అరెస్ట్



నిందితుడి అరెస్ట్ చూపిస్తున్న ఎస్‌హెచ్‌వో

బెల్లంపల్లి: బెల్లంపల్లి కూరగాయల మార్కెట్ ఏరియాలో గంజాయి విక్రయిస్తున్న ఓ యువకుడిని పోలీసులు పట్టుకున్నారు. వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో బన్సీలాల్ తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం కాంటా చౌరస్తా శివారు ప్రాంతంలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా మార్కెట్ ఏరియాకు చెందిన మహ్మద్ తాజ్ అనుమానాస్పదంగా కనిపించాడు. పోలీసులను చూసి పారిపోతుండగా వెంబడించి పట్టుకున్నారు. అతడి వద్ద 140 గ్రాముల గంజాయి లభించినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు. ఈ మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు కేజీబీవీ విద్యార్థిని



మనీషాకు ప్రశంసాపత్రం ఇస్తున్న స్వప్న

మంచిర్యాలఅర్బన్: ఈనెల 16న హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి కళోత్సవ్ పోటీలో డ్రామా అంశంలో స్థానిక కేజీబీవీలో తొమ్మిదో తరగతి చదువుతున్న మనీషా అత్యుత్తమ ప్రదర్శనతో జాతీయస్థాయికి ఎంపికైంది. శుక్రవారం కేజీబీవీలో మనీషాను కేజీబీవీ ఎస్వో స్వప్న జిల్లా విద్యాశాఖ అందించిన ప్రశంసాపత్రం, జ్ఞాపిక అందజేశారు. జాతీయస్థాయిలో రాణించి గుర్తింపు తేవాలని సూచించారు. ఉపాధ్యాయినులు మనీశాను అభినందించారు.

అమలుకు నోచుకోని సర్క్యులర్



సమయం గడిచినా నిర్మానుష్యంగా డిస్ట్రిబ్యూషన్ పాయింట్లు

- ఉత్పత్తికి తప్పని తిప్పలు

కాసిపేట: ఎన్నికల నేపథ్యంలో ఉత్పత్తికి ఇబ్బంది కలగకుండా గనుల ఆవరణలో సమావేశాలు, ప్రచారం నిర్వహించడాన్ని నిషేధిస్తూ సింగరేణి యాజమాన్యం జారీ చేసిన సర్క్యులర్ అమలుకు నోచుకోవడంలేదు. దీంతో ఆయా పార్టీలు ఎన్నికల సమావేశాలు గని బయట నిర్వహిస్తున్నాయి. కాగా, గని బయట నిర్వహిస్తున్న సమావేశాలకు కార్మికులు వెళ్తుండడంతో అరగంటకు మించి సమయం అదనంగా గడుస్తుండగా ఉత్పత్తికి ఇబ్బంది తప్పడం లేదు. ఈ తీరును చూస్తే పెనం మీది నుంచి పొయ్యిలో పడినట్లయింది అధికారుల పరిస్థితి. శుక్రవారం మందమర్రి ఏరియా కాసిపేట గనిపై చెన్నూరు, బెల్లంపల్లి నియోజకవర్గాల బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థులు బాల్క సుమన్, దుర్గం చిన్నయ్య గని బయట సమావేశం నిర్వహించారు. దీంతో టీబీజీకేఎస్ శ్రేణులు కార్మికులను మీటింగ్ వద్దకు తరలించగా ఉదయం 8.25గంటలకు కార్మికుల డిస్ట్రిబ్యూషన్ ప్రారంభమైంది. ప్రతీరోజు ఉదయం 7.15గంటలకు మస్టర్లు పడిన కార్మికులను 7.30గంటల నుంచి పనిస్థలాలు కేటాయించి పనులకు పంపిస్తారు. సమావేశాలతో గంట ఆలస్యంగా పనుల కేటాయింపు చేపట్టడం చర్చనీ యాంశమైంది. గని ఆవరణలో సమావేశం నిర్వహిస్తే 10నుంచి 15నిమిషాలు ఆలస్యం కాగానే అధికారులు కార్మికులను పిలుస్తూ డిస్ట్రిబ్యూషన్ ప్రారంభిస్తారు. గని బయట సమావేశాలు పెట్టడంతో చేసేదేమీ లేక మిన్నకుండిపోయారు. మరోవైపు గుర్తింపు సంఘం నాయకులు కావడంతో వద్దు అని బద్నాం కావడం.. వారితో శత్రుత్వం పెంచుకోవడం ఎందుకు? అని అధికారులు మిన్నకుండిపోయారు. ఈకారణం చూపి మరో రాజకీయ పార్టీ మీటింగ్ పెట్టినా అధికారులు వేచి చూడాల్సిందే. ఈ తరుణంలో సర్క్యులర్‌తో అదనంగా నష్టమే గాని ఎలాంటి ప్రయోజనం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఏది ఏమైనా మరో 10 రోజులు అధికారులకు సర్క్యులర్‌తో తలనొప్పులు తప్పేలా లేవు.

ఓ వైపు పెళ్లిళ్లు.. మరో వైపు ఫైనల్‌మ్యాచ్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఈ నెల 19 ఆదివారం శుభముహూర్తం కావడంతో జిల్లాలో పెద్ద ఎత్తున పెళ్లిళ్లు జరగనున్నాయి. ఇప్పటికే పెళ్లిళ్లకు ఫంక్షన్ హాళ్లు మొత్తం బుక్ చేసుకున్నారు. ఆదివారమే ప్రపంచ కప్ క్రికెట్ ఫైనల్ మ్యాచ్ కూడా ఉంది. దీంతో ఇటు పెళ్లిళ్లకు వెళ్లాలా?.. వరల్డ్ కప్ మ్యాచ్ చూడాలా?.. అన్న మీమాంసలో జనం ఉన్నారు. పెళ్లికి వెళ్లినా మ్యాచ్ కారణంగా త్వరగా ఇళ్లకు వెళ్లడంపై ఆలోచన చేస్తున్నారు. ఆదివారం వేళ ఎంచక్కా ఇంట్లో ఎంజాయ్ చేస్తూ భారత్–ఆస్ట్రేలియా వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్ చూసేలా క్రికెట్ అభిమానులు, వీక్షకులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. దీంతో వివాహాలు జరిపించే వారంతా పెళ్లికి వచ్చిన అతిథులు వెంటనే వెళ్తే ఫంక్షన్‌హాల్ బోసిపోతుందని గుర్తించారు. ఇంకేముంది పెళ్లికి వచ్చిన అతిథులు, శ్రేయోభిలాషులు, బంధుమిత్రులు వెళ్లిపోకుండా పెళ్లిళ్ల ప్రత్యక్ష ప్రసారం ఏర్పాటు చేసిన ఎల్ఈడీ స్క్రీన్‌లపై క్రికెట్ ఫైనల్ మ్యాచ్ కూడా తిలకించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. వివాహానికి హాజరయ్యే బంధుమిత్రులకు మొబైల్ ఫోన్లలో కొంతమంది సమాచారం ఇవ్వడం కొసమెరుపు. ఏది ఏమైనా.. పెళ్లికి వచ్చిన బంధుమిత్రులు, అతిథులకు వినోదం, సంతోషం మిస్ కాకుండా చూస్తున్నారు.

మిస్సింగ్ కేసు నమోదు



కృష్ణ (ఫైల్)

తిర్యాణి: మండలంలోని గంభీరావుపేట గ్రామానికి చెందిన యువకుడు సిరిపురం కృష్ణ ఈనెల 16న ఉదయం తాండూర్ ఐబీకి వెళ్లి వస్తానని కుటుంబసభ్యులకు చెప్పి ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదు. అతడికి ఫోన్ చేస్తే సెల్ స్విచాఫ్ వచ్చింది. ఎంత వెతికినా అతడి ఆచూకీ లభించలేదు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు శుక్రవారం మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమేశ్ తెలిపారు.

లారీడ్రైవర్‌కు ఏడాది జైలు

మంచిర్యాల క్రైం: రోడ్డు ప్రమాదంలో మహిళ మృతికి కారణమైన లారీడ్రైవర్‌కు ఏడాది జైలు శిక్షతోపాటు రూ.5వేల జరిమానా విధిస్తూ మంచిర్యాల కోర్టు మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఉపనిషద్వాని శుక్రవారం తీర్పునిచ్చారు. ఎస్‌హెచ్‌వో రాజేశ్ కథనం ప్రకారం.. 2015 డిసెంబర్ 31న జైపూర్‌కు చెందిన గోగు రాజేందర్ తన భార్య విజయలక్ష్మి కూతురు, కుమారుడితో బైక్‌పై మంచిర్యాల నుంచి స్వగ్రామానికి వెళ్తున్నారు. శ్రీరాంపూర్ బస్టాండ్ సమీపంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన టిప్పర్ బైక్‌ను ఢీకొంది. విజయలక్ష్మి అక్కడికక్కడే మృతిచెందింది. రాజేందర్, పిల్లలకు స్వల్ప గాయాలయ్యాయి. మహిళ మృతికి కారణమైన డ్రైవర్ జనగామ శివకృష్ణకుమార్‌ను పోలీసులు రిమాండ్‌కు తరలించారు. కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. పీపీ సహీన సుల్తానా వాదనలు వినిపించారు. సాక్ష్యాధారాలు ప్రవేశపెట్టి నేరం రుజువు చేయడంతో శిక్ష ఖరారు చేస్తూ జడ్జి తీర్పు వెలువరించారు.